క్లుప్తంగా

బాబాకు లక్ష పూలాభిషేకం



అభిషేకం చేస్తున్న భక్తులు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిగూడెం మార్గంలోగల శ్రీ షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో పూజలు ప్రారంభించి, బాబాకు వివిధ రకాల నైవేద్యాలు సమర్పించి లక్ష పూలతో అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయగా కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. పురవీధుల్లో భక్తిశ్రద్ధలతో బాబాకు పల్లకి సేవలు నిర్వహించారు.

జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తూ జీఎం(సివిల్)గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లును శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఉన్నతాధికారులు శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పీకేఓసీ పీఓ టి.లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, ఎస్ఓటూ జీఎం డి.శ్యామ్‌సుందర్, డీవైపీఎంఓ మేరి కుమారి, ఏజీఎం(ఐఈడీ) వెంకట్రావు, డీజీఎం(కేసీహెచ్‌పీ) మదన్ నాయక్, సెక్యూరిటీ అధికారి కె.శ్రీనివాస్, ఎంవీటీసీ మేనెజర్ నాగేశ్వరరావు, ఫైనాన్స్ మేనేజర్ పి.రమేష్, ఎస్ఈ (ఈఅండ్‌ఎం) సోమ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, పీఏ టు జీఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ములకలపల్లి: మండలకేంద్రానికి సమీపంలోని కొమరంభీం నగర్ వాసులకు సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో నివసిస్తున్న 20 వలస గుత్తికోయ కుటుంబాలకు ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి చేతుల మీదుగా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. చిన్నారులకు బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

పోస్టర్లు ఆవిష్కరణ

బూర్గంపాడు: జూన్ 8న కొత్తగూడెంలో జరగనున్న మాలల మహా జాతర ప్రచార పోస్టర్లను మాల మహానాడు పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మల కిరణ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల ఐక్యతను చాటిచెప్పి రాజ్యాంగ కల్పించిన హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపెల్లి నర్సింహారావు, పిల్లి రవివర్మ, కొనకంచి శ్రీను, కొట్టె అనిల్, పాలకుర్తి ప్రభాకర్, మేక శేషమ్మ, ఇలంగి లాలయ్య,దాసరి మోహన్, చెలికాని ప్రవీణ్, జినుగు దాసు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక చట్టం చేయాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో ఐదో షెడ్యూల్ ప్రాంతంలో లోకల్ క్యాడర్ నందు ఆదివాసీలకు ఉద్యోగ కల్పనకు ప్రత్యేక చట్ట రూపకల్పన చేయాలని ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు అన్నారు. పట్టణంలోని రాజుపేట కాలనీలో శుక్రవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో జయబాబు మాట్లాడారు. ప్రత్యేక చట్టం తీసుకురావడానికి ట్రైబల్ అడ్వజరి కౌన్సిల్ తీర్మానం చేసి రాష్ట్ర అసెంబ్లీ ఆమోదంతో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కలం సత్యనారాయణ, కొమరం నాగయ్య, కారం గాంధీ, కొర్స చిట్టిబాబు, రేసు వెంకటేశ్వర్లు, సోడి శ్రీదేవి, వాసం ఆదినారాయణ, సోడి రాంబాబు, మెస్ వసంతరావు, వట్టం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, జగిడి వెంకటేశ్వరరావు, సోయం రమేష్ బాబు, పెనుబల్లి రమేష్, సవలం వసంతరావు, గుండి చలపతిరావు పాల్గొన్నారు.

మెరుగైన ప్యాకేజీ అందించాలి

మణుగూరు రూరల్: సింగరేణి మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా భూములు కోల్పోయే నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ అందించాలని కోరుతూ శుక్రవారం తిర్లాపురంలో పీసా గ్రామసభకు విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమకు బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ కన్వీనర్ లక్ష్మణ్, నాయకులు ముత్యంబాబు, వట్టం రాంబాబు, శ్రీనివాస్, నర్సింహరావు, సురేష్, జావిద్ పాషా, పద్దం ఎను, ముత్యం రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కరువు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులు

రక్షణ కవచాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

- అనారోగ్యం బారిన పడుతున్న వైనం
- ఏళ్ల తరబడిగా ఇదే పరిస్థితి

చర్ల: పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలకు భద్రత కరువయింది. కనీస రక్షణ కవచాలు లేకుండా వారితో పనులు చేయిస్తుండడంతో వారు అనారోగ్యం పాలవుతున్నారు. గ్లౌజులు, మాస్కులు వంటి కనీస రక్షణ కవచాలను కూడా ఏర్పాటు చేయకపోవడంపై పంచాయతీ కార్మికులు తీవ్ర అనారోగ్యాల బారినపడుతున్నారు. రెండేళ్ల నుంచి పంచాయతీ కార్మికులకు యూనిఫాం, గ్లౌజులు, షూస్ అందడం లేదు. రెయిన్ కోట్లు కూడా అందకపోవడంతో జోరు వర్షంలోనూ తడుస్తూ పంచాయితీ కార్మికులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 26 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీలో ముగ్గురు నుంచి ఐదుగురు వరకు కార్మికులు పారిశుద్ధ్య పనుల్లో కొనసాగుతుండగా, మండల వ్యాప్తంగా 100 నుంచి 120 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా పంచాయతీల పరిధిలోని గ్రామాలు, కాలనీలు, శివారు ప్రాంతాల్లో డ్రెయినేజీలో పూడుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం, వ్యర్థాలను తరలించడం, మురుగు నీటిని మళ్లించడం, మురుగునీటి గుంతలను పూడ్చడం వంటి పనులు చేస్తున్నారు. వీరికి కనీస రక్షణ కవచాలు ఇవ్వకపోవడంతో ఈ సందర్భంలో వీరు దుర్గంధాన్ని భరించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారిని దృష్టిలో ఉంచుకుని తగు రక్షణ చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి



కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలి. ఎలాంటి రక్షణ కవచాలు లేకుండా వారితో పనులు చేయించడం సరైంది కాదు. వారిని కూడా పనుషల్లా చూసి వారికి భద్రత కల్పించాలి. వారికి కనీసం సౌకర్యాలు కల్పించకుండా పనులు చేయించడం సరైంది కాదు. గ్లౌజ్‌లు, మాస్కులు, షూస్, రెయిన్‌కోట్లు, యూనిఫాం అందించాలి.

– కె.బ్రహ్మచారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

చర్యలు తీసుకుంటాం



పంచాయతీ కార్మికులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నిధుల కొరత వల్ల సిబ్బందికి సౌకర్యాలు కల్పించడం కాస్తా ఇబ్బందిగా ఉన్నప్పటికీ ఇక నుంచి వారికి ఇబ్బందులు కలగకుండా మాస్కులు, గ్లౌజ్‌లు, సబ్బులు, యూనిఫాం , రెయిన్‌కోట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఈదయ్య, ఎంపీడీఓ, చర్ల

పనుల్లో ప్రాణాలమీదకు తెచ్చుకుంటూ..

పంచాయతీల్లో పని చేసే కార్మికులకు ఏటా రెండు జతల యూనిఫాం (ఖాకీ దుస్తులు), రెండు జతల షూలు, మాస్కులు, రెయిన్‌కోట్‌లతో పాటు సబ్బులు, శానిటైజర్ల వంటివి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రెండేళ్లుగా పంచాయితీ కార్మికులకు ఇలాంటివి ఏమీ అందడం లేదు. దీంతో పంచాయితీ కార్మికులు ఏటా వర్షాకాలంతో పాటు ఇతర కాలాల్లో మోకాళ్ల లోతు బురదలో దిగి దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ పనులు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ సందర్భంలో వారికి బురదలు ఉండే తేళ్లు, జెర్రులు, పాములు కరుస్తూ ప్రాణాల మీదకు వస్తోంది. డ్రెయినేజీల్లో నిలిచిన మురుగును తొలగించే సందర్భంలో మాస్కులు కూడా లేకపోవడంతో దుర్వాసనతో కార్మికులు వాంతులు చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్మికులు విధులు నిర్వర్తించాల్సి వస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని పంచాయతీ కార్మికులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పినపాక/కరకగూడెం: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్య అందుతుందని, పిల్లలను చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షుడు బి.మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పినపాక, కరకగూడెం మండలాల్లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను పొందాలని, పుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన భోజనం ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యమన్నారు. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు, ఏఐ ఆధారిత బోధనతో ప్రభుత్వ బడులు విద్యార్థుల సమగ్ర వికాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణ, రాము, విజయ్ కుమార్, మీరా హుస్సేన్, వసంతరావు, కోట్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో సముచిత స్థానం

అశ్వాపురం: బీజేపీ పాలనలో ఆదివాసీలకు సముచిత కల్పించి జీవనప్రమాణాలు పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలు తెచ్చారని గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొడియం బాలరాజు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో ఆదివాసుల మనుగడ ప్రమాదం అన్న మంత్రి సీతక్క మాటలను ఆయన తీవ్రంగా ఖండించారు. 1976 ఎమర్జెన్సీ సమయంలో పార్లమెంట్ ఆమోదం లేకుండా జీఓ పేరుతో ఆదివాసీలను అత్యంత ప్రమాదకరస్థితిలో పడేసిన విషయం సీతక్కకు తెలియదా అని ప్రశ్నించారు. రాజకీయాల కోసం ఆదివాసీల మనుగడను ప్రమాదంలో నెట్టింది చాలక తెలంగాణ ఆదివాసీ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బెల్లయ్యనాయక్‌ను చేయడం ఆదివాసీల అస్థిత్వాన్ని కనుమరుగు చేసినట్టే అన్నారు. మంత్రి సీతక్క గిరిజనుల హక్కుల సాధనకు ఆగస్టు 9న ఢిల్లీ రాంలీలా మైదానంలో ధర్నాకు పిలుపు ఇవ్వడం 2019 డిసెంబర్ 9న ఆదివాసీలతో ఆదివాసీ ఉద్యోగులు జరిపిన సభ ప్రేరణ కావడం సంతోషకరమన్నారు.

సీఐగా పదోన్నతి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న తాళ్లూరి వెంకటపయ్య సీఐగా పదోన్నతిని పొందారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఆయన 2024 జూలై నుండి దుమ్ముగూడెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదోన్నతిని పొందారు. ఈ మేరకు ఆయన్ని ప్రస్తుత సీఐ అశోక్ కుమార్, స్టేషన్ సిబ్బంది అభినందించారు.

ప్రతిష్ఠ పూజలు

ములకలపల్లి: మండలపరిధిలోని నర్సాపురంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గ్రామంలో జానకీసమేత కోదండరామ స్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలు, పోతురాజు, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకుల సందర్భంగా శుక్రవారం శాస్త్రోక్తంగా పూజలు చేశారు. యాగశాల వద్ద మహిళలు సామూహిక పూజలు చేశారు.

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామంలో నిర్మించిన రామాలయంలో నేడు(శనివారం) శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, శివలింగ, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయం వద్ద హోమాలతోపాటు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

గ్రామాన్ని సందర్శించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

కరకగూడెం: మండలంలోని విశ్వనాథకుంట గ్రామాన్ని అధికారులు శుక్రవారం సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 28న 'సాక్షి'లో ప్రచురితమైన 'గోడు పట్టించుకునేదెవరు' అనే కథనానికి అధికారులు స్పందించి ఎంపీఓ మారుతీ యాదవ్, భట్టుపల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీజా సదరు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ కనెక్షన్ ఇవ్వడానికి సాధ్యపడకపోవడంతో సోలార్ మోటార్ వాటర్‌ట్యాంక్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ కృష్ణ తెలిపారు.

ఎట్టకేలకు గోడ తొలగించారు..



గోడ తొలగించిన దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లికి బస్టాండ్‌కు సమీపంలోని సీసీ రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను ఎట్టకేలకు తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. ఈ మేరకు రోడ్డుకు అడ్డుగా గోడను నిర్మించడంపై గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'సీసీ రోడ్డుకు అడ్డంగా గోడ' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోడను తొలగించినట్లు జీపీ కార్యదర్శి రవి తెలిపారు. ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున తుది తీర్పు వచ్చే వరకు గోడ తీసేయాలని పట్టాదారులకు తెలిపామన్నారు. ఈ క్రమంలో గోడ తొలగించడంతో ఈ దారి గుండా మళ్లీ రాకపోకలు మొదలయ్యాయి.

రైతులే ప్రథమ శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ పావని

అశ్వారావుపేటరూరల్: ఆరుగాలం శ్రమించి, పంటలను సాగు చేసే రైతులే ప్రథమ శాస్త్రవేత్తలని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ పావని, డాక్టర్ కృష్ణతేజ అన్నారు. శుక్రవారం మండలంలోని కుదుములపాడు, రెడ్డిగూడెం గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో నీటి యాజమాన్యం సక్రమంగా లేకపోతే, కొన్నేళ్ల తర్వాత సాగునీటి కుడా తాగు నీరులా కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో శివరాం ప్రసాద్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ స్రవంతి, ఏఈవో ఆరేపల్లి సతీష్, రైతులు పాల్గొన్నారు.

నేడు ములకలపల్లిలో..

ములకలపల్లి: మండలకేంద్రంలోని రైతు వేదికలో నేడు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఏఓ (ఎంఏఓ) అరుణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు హాజరు కావాలని కోరారు.

పర్ణశాలలో పునర్వసు కల్యాణం



భక్తులకు అక్షింతలు వేస్తున్న అర్చకుడు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి మాసకల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పవిత్ర గోదావరి జలాలను తీర్థ బిందెలో తీసుకొని వచ్చి స్వామి వార్లకు పంచామృతములతో విశేష అభిషేకము తిరుమంజనం నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మాంగల్య ధారణ అనంతరం కల్యాణ తలంబ్రాలు ఘట్టములను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు మదన మోహనాచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మరింత విస్తృతపరచాలి

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలను మరింత విస్తృతపరచాలని, అందుకు తగిన వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించనున్న క్లస్టర్ హెల్త్ సెంటర్ అదనపు భవనాల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. నూతన భవనాలను నిర్దేశించిన సమయంలో నాణ్యతతో పూర్తిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలను పారదర్శకంగా అర్హులైన వారికి అందిస్తున్నామన్నారు. అనంతరం బూర్గంపాడు సీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సతీష్, నాయకులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న విత్తనాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ కోరారు. అశ్వారావుపేట సొసైటీ వద్ద శుక్రవారం జీలుగు, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూసారం పెంచి పెట్టుబడి తగ్గించి, లాభదాయకమైన వ్యవసాయం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తుందన్నారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో అదనపు భవనాల పనులు పరిశీలించి, క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, ఏవో శివరాం ప్రసాద్, రాంబాబు, రమేష్, వీరభద్రరావు, ప్రమోద్, కేదార్‌నాథ్, దివాకర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి నివాసంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో అభివృద్ధికి సహాయ సాకారాలు అందించాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. చలమప్పగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. కొయ్యల అచ్యుతరావు, నాగప్రసాద్ పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



బూర్గంపాడు: తనిఖీ చేపడుతున్న అధికారులు



దమ్మపేటలో..



చంద్రుగొండ: అన్నపురెడ్డిపల్లిలో..

బూర్గంపాడు: మండలంలోని విత్తన దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారులు తనిఖీలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి శంకర్ ఆధ్వర్యంలో బూర్గంపాడులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తన ప్యాకెట్లు, బిల్లులు, రికార్డులను పరిశీలించారు.

దమ్మపేట: అధికారికంగా ధృవీకరించిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఏఓ శీలం చంద్రశేఖర్‌రెడ్డి విత్తనాలు, ఎరువుల దుకాణాదారులను ఆదేశించారు. మండలకేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణంలో స్థానిక ఎస్సై సాయికిషోర్‌రెడ్డితో కలసి ఏఓ తనిఖీలు చేపట్టారు. స్టాక్ రికార్డులను పరిశీలించి, ఎరువులు, విత్తనాల ధరల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు, దానికి సంబంధించిన నగదు చెల్లింపుల రశీదులను భద్రపరచుకోవాలన్నారు.

చంద్రుగొండ(అన్నపురెడ్డిపల్లి): అన్నపురెడ్డిపల్లి మండలంలోని విత్తనషాపులను వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఏఓ అనూష, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై తిష్ట.. వెళ్లేదెట్టా..?

- విచ్చలవిడిగా రోడ్లపైకి గోవులను వదిలేస్తున్న యజమానులు
- దాడులు చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వైనం



మణుగూరు అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై గోవులు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీతో పాటు పీవీకాలనీలోని పలు చౌరస్తాల్లో రాత్రివేళ నడిరోడ్డుపై తిష్టవేస్తున్న గోవులను, పశువులను తప్పించుకువెళ్లడం వాహనదారులకు కష్టతరంగా మారుతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ ఒక్కసారిగా జనాలపై దూసుకురావడంతో పాదచారులు తప్పించుకునేందుకు పరుగులు పెడుతున్నారు. వాహనాలను ఢీకొంటుండటంతో అదుపుతప్పి కింద పడుతున్నారు.

దూసుకొస్తూ.. దాడులకు పాల్పడుతూ

రాత్రివేళ వాహనదారులు, చిరు వ్యాపారులు, ఉద్యోగాలు, పనులు ముగించుకుని హడావుడిగా ఇళ్లకు వెళ్లే సమయంలో గోవులు రోడ్డుపై, కూడళ్ల వద్ద తిష్ట వేయడం ప్రధాన సమస్యగా మారుతోంది. వచ్చి పోయే వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా తయారవుతున్నాయి. మూడు నెలల క్రితం అశోక్‌నగర్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిపై ఆవు దాడి చేసి పొట్టలో కొమ్ములతో దాడి చేయడంతో ఆస్పత్రి పాలయ్యాడు. రెండు రోజుల క్రితం బాంబే కాలనీలోని ఓ ప్రధాన ఆలయం వద్ద గుంపులుగా ఉన్న ఆవులు వాహనాలపైకి దాడి చేసి ఓ వ్యక్తికి గాయపర్చగా, తీవ్రగాయాలయ్యాయి. గంటల తరబడి రోడ్లపై పశువులు పడుకోవడం, నిలబడటంతో వాహనచోదకులకు దగ్గరికి వచ్చేదాకా అర్థం కాని పరిస్థితి నెలకొంది. పగలు సమయంలో రోడ్లపై ఉండే చిరు వ్యాపారులను ఇబ్బందులు, రాత్రివేళ వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పీవీకాలనీలోని బాంబే కాలనీ కూడలి వద్ద

హెచ్చరికలతోనే సరి....

గతంలో ఆవులు ప్రధాన రోడ్డుపై సంచరిస్తే జియో ట్యాగ్ ఆధారంగా యజమానులకు సమాచారం అందించి హెచ్చరికలు చేసిన ఘటనలు ఉన్నాయి. వివరాలు తెలియని పశువులను సమీపంలోని గోశాలలో ఉంచి సంప్రదించిన వారి వివరాలు సేకరించి అందించిన ఘటనలు ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఇటు మున్సిపాలిటీ సిబ్బంది, అటు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలపై, వాహనదారులపై రాత్రివేళ దాడులు చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లపైకి విచ్చలవిడిగా వదులుతున్న పశువుల యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి యథేచ్ఛగా రోడ్లపై వదిలే విధానాన్ని నివారించాలని సంబంధిత అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.